క్లుప్తంగా

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే కైలే



పామర్రు: రాష్ట్ర డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డిని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. డీజీపీతో పలు అంశాలపై ఎమ్మెల్యే కైలే చర్చించారు.

సమన్వయంతో మండల అభివృద్ధి



పెదపారుపూడి: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ గోగం సురేష్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.సీతామహాలక్ష్మి, తహసీల్దార్ వి.నాగభూషణం, వైస్ ఎంపీపీ పొనుగుమాటి రజిని, ఎంపీటీసీలు చిగురుపాటి అశోక్‌కుమారి, మద్దాలి జ్యోతి, జిజ్జువరపు రాజిమ్మ, జాజుల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు పాతూరి రమేష్, పుణుకొల్లు శివరామప్రసాద్, ప్రత్తిపాటి హర్షవర్ధన్, నీలపాల పేరేసు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీఓస్ క్యాలెండర్ ఆవిష్కరణ



కైకలూరు: ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే డీఎన్నార్ తెలిపారు. కైకలూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏపీ ఎన్జీఓస్ క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కై కలూరు తాలూకా యూనిట్ అధ్యక్షులు కె.తాతారావు, కార్యదర్శి షేక్ అబ్దుల్ హనిఫ్, నాయకులు ఎస్ఎస్ఎన్.మూర్తి, డి.లక్ష్మీనారాయణ, టీవీ.రమణ, నాగేశ్వరరావు, వెంకటనాథ్, సుదీర్, సంతోషబాబు, హనుమంతరావు, నాగమణి, మంజు, తనూజ పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై అవగాహన

తోట్లవల్లూరు: సేంద్రియ పంటల సాగుపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పెనమకూరు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ సూచించారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో జన్యా ఫౌండేషన్ ఆధ్వర్యాన గత కొంతకాలంగా జన్యా నేచర్ ల్యాబ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు, మొక్కలు పెంచటంపై అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ఉపాధ్యాయుడు సీతారెడ్డి, మత్తే విజయనాగరాజు, జన్యా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

28న ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవం

పెదపూడి(మొవ్వ): మండల పరిధిలోని పెదపూడి గ్రామంలో పునర్నిర్మించిన సీతారామ చంద్ర స్వామి వార్లు, గణపతి, చంద్రమ్మ అమ్మవార్ల ఆలయాన్ని ఈ నెల 28వ తేదీన ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే ధ్వజ, యంత్ర, స్థిరల ప్రతిష్ఠా మహోత్సవాన్ని కూడా నిర్వహిస్తామని, ఈ కార్యక్రమాలను శ్రీ గుండెపూడి, నాగరాజ శేఖర శర్మ బ్రహ్మత్వంన గురుదేవులు కే భానుప్రసాద్ దివ్య మంగళ శాసనంతో జరుగుతాయన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పామర్రు: మండల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులను కోరుతున్నామని పామర్రు ఎంపీడీఓ వై.రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాపర్ల సచివాలయం పరిధిలోని జుఝవరం, రాపర్ల గ్రామాల్లో ఒక్కో పోస్టు, పామర్రు-1లో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 11 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు.

లక్ష్మీగణపతి హోమం

గుడివాడటౌన్: స్థానిక మెయిన్ రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. పట్టణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని 72 మంది దంపతులు ఈ హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్, పాలకవర్గ చైర్మన్ చంద్రశేఖర్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన చందన అలంకారం

పామర్రు: మండల పరిధి పెరిశేపల్లి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ అలవేలు మంగా పద్మావతీ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా మంగళవారం గోదాదేవి చందన అలంకారంలో దర్శనమిచ్చారు. సుప్రభాత సేవ, బిందెతీర్థం, తిరుప్పావై పారాయణ, విశేష పూజలు నిర్వహించారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యేలు కైలే, డీఎన్నార్



రావులపాడులో స్థానిక సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కైలే



ఈడేపల్లిలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

గడప గడపకు.. మన ప్రభుత్వం

రావులపాడు(పెదపారుపూడి): రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ, ప్రజల జీవితాలను మార్చిన ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని రావులపాడు గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. అంతర్గత రోడ్డు సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వెళ్లారు. స్పందించిన వెంటనే సమస్యను పరిష్కరించాలని సంబంధింత అధికారులకు ఆదేశించారు.

శక్తి వంచన లేకుండా అభివృద్ధి..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతో పాటు అగ్రవర్ణ మహిళలకు సైతం సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలన క్షేత్ర స్థాయికి తీసుకుని వచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే, పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, ఎంపీడీఓ టి.సీతామహాలక్ష్మి, మార్కెట్ యార్డు డైరెక్టర్లు చీకుర్తి వరప్రసాద్, గోళ్ల వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ గోళ్ల సోమేశ్వరరావు, పాతూరి రమేష్, జూపల్లి రాజేశ్వరి, మాజీ జెడ్పీటీసీ మూల్పూరి హరీష, పెదపారుపూడి పీఏసీఎస్ బ్యాంక్ అధ్యక్షుడు తుమ్మల కోటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

ముదినేపల్లిరూరల్: రాష్ట్రంలోని పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తూ పేదల పక్షపాతిగా నిలుస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని కొరగుంటపాలెం సచివాలయ పరిధిలోని ఈడేపల్లి, సీతారామపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా పేదలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ప్రధానంగా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు పలు పథకాలను ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేస్తున్నారన్నారు.

గడప గడపలో ఆదరణ

నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నాటికి 50 సచివాలయాల్లో పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంపీపీ రామిశెట్టితో పాటు ఈడేపల్లి సర్పంచ్ అబ్బిశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఎంతో చైతన్యం రావడంతో పాటు సంక్షేమ పథకాలపై అవగాహన ఏర్పడుతుందని ఎమ్మెల్యే చెప్పారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలకు తెరపడడంతో పాటు వైఎస్సార్ సీపీకి గడప గడపలో ఆదరణ లభిస్తోందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కై కలూరు నియోజకవర్గం రాష్ట్రంలోనే ఐదో స్థానంలో నిలవడానికి నియోజకవర్గాల్లోని పార్టీ శ్రేణులు, ప్రజలు అందిస్తున్న సహాయ సహకారాలే కారణమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీలు రాచూరి రాధా, చొప్పర్ల సునీత, సర్పంచ్‌లు పేరే రామకృష్ణ, శీలం రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, మహిళా విభాగం అధ్యక్షురాలు బుగ్గర శ్రావణి, నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు, బొర్రా శేషుబాబు, అచ్యుత రాంబాబు, కోమటి విష్ణువర్ధన్, ఈడే వెంకటేశ్వరరావు, బండి నాగరాజు, నాగమల్లేశ్వరరావు, బండారు ఆంజనేయులు, సత్యనారాయణ, బండి రాంబాబు, శీలం వెంకన్న, దాసరి చిరంజీవి, ఏఎస్ బాబు, బేతు సింహాచలం, ముంగర గోపాలకృష్ణ, బలే నాగరాజు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆటల పోటీలు

తోట్లవల్లూరు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని భారత యువజన సంఘం ఆధ్వర్యాన మండలంలోని పెనమకూరులో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు యూత్ అధ్యక్ష, కార్యదర్శులు మరీదు యోహాన్, మరీదు మధుసూదనరావు తెలిపారు. కోడిపందేలు, జూదానికి వ్యతిరేకంగా గత 36 ఏళ్లుగా సంక్రాంతి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 12 నుంచి 14వ తేదీ వరకు వాలీబాల్, షటిల్ పోటీలు, 13న చిన్నారులకు పరుగు పందెం, మ్యూజికల్ చైర్స్, 15న మహిళలకు రంగవల్లుల పోటీలు, 16న విజేతలకు బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు 97038 93819, 9848094044 నంబర్లలో సంప్రదించి టీమ్‌ల వివరాలు తెలియజేయాలని యోహాన్ కోరారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు

గుడివాడటౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిపారు. సంప్రదాయ వంటకాలు, భోగిమంటలు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, హరిదాసులు, రంగవల్లులు తదితర అంశాలను ప్రదర్శించారు. విద్యార్థులు పట్టుచీరలు, పట్టు పంచెలు ధరించి తెలుగుదనం ఉట్టిపడేలా కార్యక్రమాలు నిర్వహించారు. రంగవల్లుల పోటీల్లో 27 బృందాలు పాల్గొన్నాయి. కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కళ్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రసాదరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు

గుడివాడటౌన్: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ స్టేడియంలో సంక్రాంతి నేపథ్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో రంగులు లేకుండా ముగ్గుల పోటీలు జరిపామని నిర్వాహకులు తెలిపారు. 62 మంది పోటీల్లో పాల్గొన్నారన్నారు. విజేతలకు సంక్రాంతి రోజు బహుమతులు అందజేస్తామని చెప్పారు.

ఆనందోత్సాహాల్లో అన్నదాతలు

- రైతుల ఖాతాల్లో ధాన్యం విక్రయించిన నగదు జమ
- ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన రైతులు



ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ పద్మావతి, అధికారులు(ఫైల్)

గుడివాడటౌన్(నందివాడ)/గుడివాడరూరల్/గుడ్లవల్లేరు: రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు గిట్టుబాటు ధరతో పాటు సకాలంలో డబ్బు చెల్లించడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తం అవుతుంది. ప్రభుత్వం చేపట్టిన ఈ విధానం వలన రైతుకు ఎంతో మేలు జరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. నందివాడ మండల తహసీల్దార్ రవికాంత్ తెలిపిన వివరాల ప్రకారం మండలానికి చెందిన 8 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 4262 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. 11,884 మెట్రిక్ టన్నులు ధాన్యం ఉత్పత్తి కాగా 3,249 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ప్రతి రైతుకు 21 రోజుల్లో సొమ్ము చెల్లించామన్నారు. గుడివాడ రూరల్ మండలంలో 15,747 ఎకరాల్లో వరి సాగు చేయగా 42,175 టన్నులు దిగుబడి వచ్చింది. ఇప్పటి వరకు 13,614 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 150మంది రైతుల వద్ద నుంచి సేకరించారు. గుడ్లవల్లేరు మండలంలో 17 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయని అబ్దుల్ రెహమాన్ మస్తాన్ తెలిపారు. మండలంలో 23,377ఎకరాల్లో వరి సాగు చేపట్టగా 70,131 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు 12,536 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు.

దళారుల ప్రమేయం లేదు..



ఖరీఫ్‌లో 5 ఎకరాలు సాగు చేశా. 357 బ్యాగులు రైతు భరోసా కేంద్రం ద్వారా విక్రయించా. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం రూ.3 లక్షల 6 వేలు నగదు 21 రోజుల్లో నా ఖాతాలో పడ్డాయి. దళారుల కమిషన్‌ల భారం లేకుండా నేరుగా నాకు చెందిన సొమ్ము నాఖాతాలో పడటం వలన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నా. – తాతినేని మురళీకృష్ణ, రైతు, పెదలింగాల

21 రోజుల్లో నగదు జమ



వరి సాగు చేపట్టాను. ధాన్యాన్ని ఆర్బీకే ద్వారా విక్రయించా. గిట్టుబాటు ధర రావడంతో ఆనందంగా ఉంది. ధాన్యం మిల్లులకు చేరిన తర్వాత ఆన్‌లైన్ విధానంలో 21 రోజుల్లో నా ఖాతాలో ప్రభుత్వం నుంచి నగదు జమ అయ్యింది. గతంలో అనేక ఇబ్బందులు పడ్డాం. ఈ ప్రభుత్వంలో ధాన్యం విక్రయాల్లో మేలు జరిగింది. – కొల్లేపల్లి శంకరరావు, రైతు లింగవరం

రంగు మారిన ధాన్యం కొన్నారు..



అకాల వర్షాలకు దెబ్బ తిన్న రంగు మారిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసింది. కొనుగోలులో నిబంధనలను చాలా పక్కాగా నిర్వహించి మాకు మద్దతు వచ్చేటట్టు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మంచి ధర పలకడంతో మేము సంతృప్తికరంగా ఉన్నాం. సకాలంలో నగదు జమ అయ్యింది.
– అబ్బినేని రఘుబాబు, రైతు, పెంజెంద్ర

నేటి నుంచి 'ఎన్టీఆర్ టు వైఎస్సార్' సంక్రాంతి సంబరాలు



గుడివాడలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుడివాడటౌన్: తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయాలు యువతకు తెలియజేయాలనే ఉద్దేశంతో గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) నేతృత్వంలో ఎన్టీఆర్ టు వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ బుధవారం నుంచి నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలను జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. స్థానిక లింగవరం రోడ్డులోని కే కన్వెన్షన్ నగర్‌లో మంగళవారం నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు ప్రజలకు అత్యంత ప్రీతికరమైన పండుగ సంక్రాంతి అని గ్రామీణ క్రీడలు అందుకు నిదర్శనమన్నారు. రోజు రోజుకు కనుమరుగవుతున్న ఒంగోలు జాతి పశువులను అభివృద్ధి చేసేందుకు పశుపోషకులను ప్రోత్సహించేందుకు నిర్వహించే ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు ఇక్కడ నిర్వహిస్తున్నారన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీలను మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) ప్రారంభిస్తారన్నారు. మొత్తం 7 విభాగాల్లో జరిగే ఈ పోటీలు ఈనెల 15వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు సరిహద్దు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణా, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఎడ్ల జతలు ఈ పోటీల్లో పాల్గొంటాయన్నారు. గుడివాడ నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంత ప్రజలు సైతం ఈ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి శివ సుబ్రహ్మణ్యేశ్వరరావు(చంటి), నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, మట్టా జాన్‌విక్టర్, మాజీ ఎంపీటీసీ కె.శంకరరావు, సీనియర్ నాయకులు రామలింగారెడ్డి, పాలడుగు రామ్ ప్రసాద్, కుర్మా రాజు, ప్రముఖ పశుపోషకులు భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జంతువులను హింసిస్తే కఠిన చర్యలు

ఆర్డీఓ పద్మావతి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ పద్మావతి

గుడివాడరూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జంతువులను హింసిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ పి.పద్మావతి ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, పోలీస్ శాఖ, ఎంపీడీఓలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. సంక్రాంతి నేపథ్యంలో కోడిపందేలు, ఇతర చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడి, జంతువులను హింసించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం జంతువులను హింసించే వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. కోడిపందేలతో పాటు ఇతర పందేలను నిషేధించాలని చెప్పారు. అటువంటి చర్యలకు పాల్పడే వారిని ముందుగానే గుర్తించి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని ఆర్డీఓ ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిని గుర్తించి పోలీసు శాఖతో అనుసంధానంగా పని చేసి జూదాలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డివిజన్‌లోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీసు శాఖ, సిబ్బంది పాల్గొన్నారు.

కానుకొల్లులో అవగాహన సదస్సు

మండవల్లి: సంక్రాంతి పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కానుకొల్లులో సర్పంచ్ నాగదాసి థామస్ అధ్యక్షతన గ్రామ సచివాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కోడిపందేలు, పేకాట, గుండాట, బెల్టుషాపుల నిర్వహణ తదితర అసాంఘిక కార్యక్రమాల నిషేధంపై అవగాహన సదస్సు జరిగింది. మాజీ సర్పంచ్ పుట్టి సత్యనారాయణ, వీఆర్వో, కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడలకు మొగ్గ చూపాలి



చెడుగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు:సంక్రాంతి పండుగ వేళల్లో జూద క్రీడలకు ప్రజలు స్వస్తి పలికి సంప్రదాయ క్రీడలకు మొగ్గు చూపాలని ఎమ్మెల్యే డీఎన్నార్ సూచించారు. జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాలతో కైకలూరు పట్టణ సీఐ ఎంవీఎస్ నాగరాజు నిర్వహణలో తాలూకా సెంటర్ వద్ద నియోజకవర్గ చెడుగుడు పోటీలను ఎమ్మెల్యే డీఎన్నార్ మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని మండలాల్లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో సంప్రదాయ క్రీడలు జరగడం అభినందనీయమన్నారు. సీఐ నాగరాజు మాట్లాడుతూ గురువారం వరకు పోటీలు జరుగుతాయన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ల బేబీ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భట్రాజు శివాజీ, రూరల్ సర్కిల్ సీఐ వైవీవీఎల్.నాయుడు, టౌన్ ఎస్ఐ గాయత్రీ, ఏఎంసీ వైస్ చైర్మన్ కొండరాజు, ఎంపీటీసీ సభ్యుడు మంగినేని రామకృష్ణ, నిమ్మల సాయి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

కైకలూరు(కలిదిండి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఎమ్మెల్యే డీఎన్నార్ అన్నారు. కలిదిండి మండలం కోరుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, రాష్ట్ర క్షత్రియ, హౌసింగ్ కార్పొరేషన్ల డైరెక్టర్లు శ్రీదేవి, సంధ్య, ఉప సర్పంచ్ చెన్నంశెట్టి నాగరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు నరసయ్య, నాయకులు సోమేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాలను ఎన్నుకోవాలి

కైకలూరు: నియోజకవర్గంలో పదవీకాలం పూర్తయిన గ్రామైఖ్య సంఘాలు నూతన పాలకవర్గాలను ఎంపిక చేసుకోవాలని ఎమ్మెల్యే డీఎన్నార్ అన్నారు. కైకలూరు పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాలుగు మండలాల ఏపీఎంలు, సీసీలతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మహిళ స్వావలంబన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో గ్రామైఖ్య సంఘాల పనితీరు బాగుందని కితా బిచ్చారు. ఎంపీపీలు అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వర రావు, రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర క్షత్రియ, హౌసింగ్ కార్పొరేషన్ల డైరెక్టర్లు నంబూరి శ్రీదేవి, ఘంటా సంధ్య, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు భట్రాజు శివాజీ, గుమ్మడి వెంకటేశ్వరరావు, తిరుమాని రమేష్, మోట్రూ ఏసుబాబు, నాయకులు పాల్గొన్నారు.

ముదురుతున్న శ్మశానవాటిక వివాదం

కైకలూరు: కొల్లేరు గ్రామం నత్తగుళ్లపాడు శ్మశానవాటిక స్థలం వివాదం రోజురోజుకు జటిలమవుతోంది. గ్రామ సర్పంచ్ ముంగర రామకృష్ణంరాజు గ్రామంలో శ్మశానవాటిక స్థలాన్ని నబిగారి రాంబాబు అనే వ్యక్తి తన చేపల చెరువులో కలిపి ఆక్రమించుకున్నాడని అటవీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడం విధితమే. దీంతో స్పందించిన ఫారెస్ట్ రేంజర్ జె.శ్రీనివాసరావు, ఫారెస్టు బీట్ ఆఫీసరు కావడి వెంకన్న వివాదాస్పద స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఆ సమయంలో ఇరువర్గాలు ఫారెస్టు అధికారుల ఎదుటే వాగ్వాదానికి దిగారు. అనంతరం ఫారెస్టు రేంజర్ మాట్లాడుతూ చేపల చెరువులో కొంతభాగం ఆక్రమణకు గురైనట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చామన్నారు. సదరు వ్యక్తికి ఫారెస్ట్ స్థలాన్ని ఖాళీ చేయాలని ఆదేశించామన్నారు. అదే విధంగా సర్కారు కాల్వ సమీపంలో అక్రమంగా సాగు చేస్తున్న చేపల చెరువుకు గండ్లు పెట్టామన్నారు. కొల్లేరు అభయారణ్యం భూమిని ఆక్రమించుకుంటే కేసులు నమోదు చేస్తామని రేంజర్ హెచ్చరించారు.

రేపు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా సమావేశం

గుడ్లవల్లేరు: ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా స్థాయి సమావేశాన్ని బుధవారం ఉదయం గుడ్లవల్లేరు పాల శీతల కేంద్ర ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బి.కనకరావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో నూతన కమిటీ ఎన్నికతో పాటు తమ ఫెడరేషన్‌కు చెందిన వివిధ తీర్మానాలను ఆమోదిస్తామన్నారు.

సొసైటీ సాగుదారుల వివరాలతో గ్రామసభలు

తోట్లవల్లూరు: లంకల్లో సొసైటీ భూముల సాగుదారుల సర్వే పూర్తయినట్లు తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపారు. ఈ విషయమై తోట్లవల్లూరు, చాగంటిపాడు గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు జరిగాయి. గ్రామసభల్లో లబ్ధిదారుల వివరాలను వీఆర్వోలు చదివి వినిపించారు. మండల వ్యాప్తంగా బీసీ, ఎస్సీలకు సంబంధించి 22 సొసైటీలు ఉన్నాయని, 1500ఎకరాల విస్తీర్ణంలో 3 వేల మంది లబ్ధిదారులు ఉన్నారని తహసీల్దార్ వెంకటశివయ్య తెలిపారు. మండల అధికారుల బృందం కూడా పరిశీలించిన అనంతరం జాబితాలను జిల్లా అధికారులకు పంపుతామన్నారు. వీఆర్వోలు బండి నాగేశ్వరరావు, బాలకోటయ్య పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

[illegible]

నాడు - నేడు పనులకు శంకుస్థాపన



రావులపాడులో అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కైలే

రావులపాడు(పెదపారుపూడి): మండలంలోని రావులపాడు గ్రామంలో మన బడి నాడు - నేడు ఫేజ్-2 కింద అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో రూ.16 లక్షలతో అంగన్‌వాడీ భవనం నిర్మిస్తున్నామన్నారు. నాడు-నేడు పనులతో అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. గ్రామంలో పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరటంతో మండల పరిషత్ నుంచి 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.5 లక్షలతో అభివృద్ధి చేసిన భవనాన్ని ఎమ్మెల్యే కైలే ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ గోగం సురేష్, ఎంపీడీఓ టీ.సీతామహాలక్ష్మి, పామర్రు మార్కెట్ యార్డు డైరెక్టర్ చీకుర్తి వరప్రసాద్, మాజీ జెడ్పీటీసీ మూల్పూరి హరీష, సర్పంచ్‌లు గోళ్ల సోమేశ్వరరావు, జూపల్లి రాజేశ్వరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.శివనాగమణి, నాయకులు తుమ్మల కోటేశ్వరరావు, దొండపాటి రాంబాబు, జాజుల నాగరాజు, జూపల్లి వెంకటరావు, దూడల నాగార్జున పాల్గొన్నారు.

రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

పామర్రు: మాండూస్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రంగు మారిన, పాడైన ధాన్యాన్ని నిబంధనల మేరకు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పామర్రు తహసీల్దార్ వి.వి.భరత్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం పీఏసీఎస్ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందితో ధాన్యం కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులు ధాన్యం కొనుగోళ్లలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. మండలంలో ధాన్యం సేకరణ టార్గెట్ 30 వేల టన్నులు కాగా ఇప్పటి వరకు 11 వేల టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. డీటీ మల్లేశ్వరరావు, పీఏసీఎస్ కార్యదర్శులు శేషురెడ్డి, ఉమేష్, రవి, వనజాక్షి పాల్గొన్నారు.

కూచిపూడి(మొవ్వ): మొవ్వ 16 ఆర్బీకేల్లో రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ తెలిపారు. కూచిపూడిలోని ఓ రైస్ మిల్‌ను ఆయన పరిశీలించి మిల్లర్‌కు పలు సూచనలు అందజేశారు. రంగు మారిన, చెడిపోయిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో మిల్లర్లు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని టెక్నికల్ అసిస్టెంట్, కస్టోడియన్ అధికారి నిర్ణయించిన నాణ్యత ఆధారంగానే కొనుగోలు చేయాలని సూచించారు. 10 శాతం రంగుమారిన ధాన్యం క్వింటా రూ.1,930కి, 10-20 శాతం రూ.1,750, 20-30 శాతం రూ.1,530, 30-40 శాతం రూ.1,400, 40 శాతానికి పైన రూ.1,300లకి ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించామన్నారు.